క్లుప్తంగా

ఓటు ద్వారానే భవిష్యత్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోనిటౌన్: ఓటు అనే ఆయుధం ద్వారానే భవిష్యత్ సాధ్యమని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన బుధవారం చిన్నశక్తి గుడి ఏరియాలో 'మీ ఓటు మీ భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు ప్రాధాన్యత, విలువపై వివరించారు. ప్రధానంగా మహిళలకు ఓటు హక్కుపై క్షుణ్ణంగా వివరించారు. రాజ్యాంగం కల్పిస్తున్న ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఐకేపీ మెప్మా ప్రాజెక్టు అధికారిణి రజియాభాను, సీఓలు వీరారెడ్డి, బాషా, కృష్ణవేణి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

బసాపురంలో దేవర



కుంభాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఆదోనిరూరల్: మండలంలోని బసాపురం గ్రామంలో దేవమ్మవ్వ, మారెమ్మవ్వ దేవర బుధవారం ఘనంగా జరిగింది. దాదాపు 60 నుంచి 70 కుటుంబాలవారు కుంభాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు చేరుకుని దేవమ్మ, మారెమ్మవ్వకు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ హనుమంతమ్మ, ఏసీ సీతారామిరెడ్డి, ఏసీ సురేష్‌రెడ్డి, ఏసీ ప్రకాష్‌రెడ్డి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది


కౌతాళం: స్థానిక తహసీల్దారు కార్యాలయం వెనుక భాగంలోనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గుర్తించిన స్థానికులు వెంటనే సబ్‌స్టేషన్ సిబ్బందికి సమాచారం చేరవేడంతో వారు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. అనంతరం ఆదోని అగ్నిమాపక శాఖ అధికారులకు తెలియజేయగా వారు వచ్చి మంటలను ఆర్పి వేశారు. ఇక్కడ చెత్తచెదారం వేస్తుండడంతో మంటలు చెలరేగి చుట్టూ వ్యాపించాయని స్థానికులు తెలిపారు.

బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

– మరొకరికి తీవ్ర గాయాలు

ఆదోనిఅర్బన్: పెద్దకడుబూరు మండలం నౌలేకల్ గ్రామ సమీపంలో రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పెద్దతుంబళం గ్రామానికి చెందిన బసవరాజు, భార్య ఈరమ్మ, ఐదు నెలల బాలుడు బైకుపై వెళ్తుండగా అటువైపు నుంచి ఆదోని మండలం బసలదొడ్డి గ్రామానికి చెందిన వీరేష్ బైకుపై వచ్చి ఎదురుగా ఢీకొట్టాడు. ప్రమాదంలో బసవరాజు (30) అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన వీరేష్‌ను స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. నౌలేకల్ గ్రామంలో దేవరకు బసవరాజు కుటుంబసభ్యులు వెళ్లి తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బసవరాజు భార్య, కుమారుడికి ఎలాంటి గాయాలు కాలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిన్నారులపై వీధి కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన లోకేష్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం వీధి కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ముగతి పేటకు చెందిన రుతిక్ (8) ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి కరవడంతో గాయాలయ్యాయి. అలాగే సోమేశ్వర సర్కిల్ బొడ్రాయి సమీపంలో లోకేష్ (5) ఇంటి ముందు ఉండగా కుక్క దాడిచేయడంతో చేతికి గాయమైంది. గాయపడ్డ చిన్నారులను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు చికిత్స చేసి ఇంటికి పంపారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని మున్సిపల్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వీధివీధినా సీసీ రోడ్లు

- మౌలిక వసతులు కల్పించిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- ఆదోని మున్సిపాలిటీలో 18వ వార్డుకు మహర్దశ



ఎరుకల కాలనీలో మురుగు కాలువ నిర్మిస్తున్న దృశ్యం



ఎరుకల కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 18వ వార్డులో అభివృద్ధి పరుగులు తీస్తోంది. మొన్నటివరకు ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడేవారు. అయితే జగనన్న ప్రభుత్వంలో ప్రతి వార్డు, సందుసందునా సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మితమవుతున్నాయి. ఎన్నోయేళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నాయి. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో ఒక్కొక్క వార్డులో రూ.4 లక్షలు కూడా ఖర్చు చేయని పరిస్థితి ఉండేది. అయితే నేడు ఒక్కొక్క వార్డులో అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలు దాకా ఖర్చు చేశారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి పైపు లైన్లు, వీధి దీపాలు, పబ్లిక్ కుళాయిలు, సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జనాభా వివరాలు

18వ వార్డులో 4 వేల మంది జనాభా ఉన్నారు. అందులో పురుషులు 1800 మంది, స్త్రీలు 2,200 మంది, పింఛన్‌దారులు 400 మంది ఉన్నారు.

అభివృద్ధి పనుల వివరాలు

18వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు రూ.20 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్, శ్మశానవాటిక పక్కన సీసీ రోడ్లు, మురుగు కాలువలను ఏర్పాటు చేశారు.

మూడు రోడ్లను నిర్మించారు.

- ఇందిరా నగర్‌లోని ఫిలిప్స్ చర్చి వద్ద రూ.5.50 లక్షలతో మురుగు కాలువలను ఏర్పాటు చేశారు.
- రూ.5.20 లక్షలతో మురుగు కాలువలు, కల్వర్టులు నిర్మించారు.
- 4వ తరగతి ఉద్యోగులైన మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. 4వ తరగతి ఉద్యోగులకు క్వార్టర్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.



ఆర్టీసీ కాలనీ-ఎరుకల కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు, మురుగు కాలువ

సీసీ రోడ్లు, మురుగు కాలువలను ఏర్పాటు చేశాం



18వ వార్డు ఇందిరానగర్, ఎరుకల కాలనీ, మహాయోగి లక్ష్మమ్మవ్వ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేశాం. సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించడంతో పాటు తాగునీటి పైపులైన్లను ఏర్పాటు చేశాం. ఆయా సౌకర్యాల కోసం సుమారు రూ.50 లక్షలకు పైగానే ఖర్చు చేశాం. ప్రజల అవసరం మేరకు పనులు చేశాం. మరో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. – చిన్నా, 18వ వార్డు కౌన్సిలర్

అభివృద్ధి దిశగా చర్యలు



17, 18, 19 వార్డుల అభివృద్ధి కోసం మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వానికి నివేదికలను సమర్పించారు. ఈ మూడు వార్డులు ఒకదానితో ఒకటి కలిసి ఉన్నాయి. ఒక వార్డులో ఓటరు మరొక వార్డులోని కేంద్రానికి వెళ్లి ఓటు వేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో మూడు వార్డులను అభివృద్ధి చేసేందుకు గానూ రూ.కోటి నిధుల కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మూడు వార్డులు దళిత వార్డులే కావడం విశేషం. ప్రస్తుతం గడప గడపకు మన ప్రభుత్వం, మున్సిపల్ జనరల్ ఫండ్స్, 14, 15వ ఆర్థిక సంఘం నిధుల కింద ఎంతో అభివృద్ధి చేశారు. చేయాల్సిన పనులు అనేకం ఉన్నాయి.

– చలపతి, కౌన్సిలర్

బార్ అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ఆదోనిరూరల్: ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ బుధవారం విడుదలైంది. ఈ నెల 22, 23వ తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, అదేరోజు ఉపసంహరణ, 27న పోలింగ్, అదే రోజు సాయంత్రం ఫలితాల ప్రకటన ఉంటుందని ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాదులు శ్రీరాములు, మల్లికార్జున తెలిపారు. వార్షిక సబ్‌స్క్రిప్షన్ నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఓటు హక్కు కల్పిస్తామని బార్ అసోసియేషన్ నాయకులు అనితాబాయి తెలిపారు. దీనిపై సీనియర్ న్యాయవాదులు జి.సి.రంగన్న, ఖాసీం అభ్యంతరాలు తెలిపారు. అయితే బార్ రూం నిర్వహణ ఎలా చేయాలో కూడా సలహాలు ఇవ్వాలని ఈసీ మెంబర్లు కోరారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు విశ్వనాథ్ రెడ్డి, విరూపాక్షి రెడ్డి, శ్రీధర్ రెడ్డి, జీవన్‌సింగ్, అబ్దుల్‌రషీద్, తబ్రేజ్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: మండలంలోని కల్లుకుంట గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. బుధవారం గ్రామంలో తనిఖీలు చేస్తుండగా గ్రామ శివారు నుంచి అంగల దుర్గప్ప అనే వ్యక్తి బైక్‌పై 10 బాక్స్‌ల్లో 960 టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని, అలాగే నిందితుడికి మద్యం సరఫరా చేసిన కోసిగికి చెందిన షేక్ నబిరసూల్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అంగల దుర్గప్పను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఉపవాస వేళ ఆరోగ్యం జాగ్రత్త



ఆదోని సెంట్రల్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు 40 రోజులు పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరిస్తారని, ఆ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహులు తగు ఆహార నియమాలను పాటించాలని లేకుంటే మరిన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఉపవాసం ప్రారంభించే ముందుగా డాక్టర్లతో అన్ని రకాల వైద్య పరీక్షలను చేయించుకోవాలి. మధుమేహం ఎంత ఉందో తెలుసుకోవాలి. ఉపవాసంలో భక్తులు 12 గంటలపాటు ఎలాంటి ఆహారం తీసుకోరు. దానికి తగినట్లుగా భోజనం, ఆహార పదార్థాలతో పాటు మాత్రల విషయంలో తగు జాగ్రతలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఆహార నియమాలు ఇలా

పరిమితిగా తినదగినవి: మొక్కజొన్న, రాగులు, వరి, జొన్న, గోధుమ, సజ్జలు పిండితో పాటు దుంపకూరలు వాడాలి.

తక్కువగా తీసుకొనదగినవి: వేరుశనగ గింజలు, జీడిపప్పు, బాదం, పిస్తా, కొబ్బరి, ద్రాక్షపండ్లు, బత్తాయి, కమలా పండ్లను పరిమితిగా తీసుకుంటే మంచిది.

తినకూడని పదార్థాలు: తీపి బిస్కెట్లు, కేకులు, పంచదార, బెల్లం బేకరి వస్తువులతో పాటు కూల్‌డ్రింకులు, జామ్, వెన్న, నెయ్యి, వేపుడు పదార్థాలు, బొంబాయి రవ్వ, మైదాపిండి, సపోట, సీతాఫలం, జంతువుల లివర్, మెదుడు, మాంసం, బంగాళదుంప, చిప్స్ మద్యం వంటివి నివారిస్తే మంచిది.

బోలెడంత ఉపయోగాలున్నవి: పప్పులు, వెన్నతీసిన పాలు, మజ్జిగ, బొప్పాయి, జామ, దానిమ్మ, టమాట, క్యాబేజీ, క్యారెట్లతో పాటు అన్ని రకాల ఆకుకూరలు తీసుకుంటే మంచిది.

తగిన జాగ్రతలు తీసుకోవాలి

ఉపవాస వేళ ముఖ్యంగా శరీరంలో నీటి శాతం తగ్గకుండా, నీరసపడకుండా చూసుకోవాలి. ఎక్కువగా నీడ ప్రదేశంలోనే ఉంటూ శారీరక శ్రమ తగ్గించుకుంటే మంచిది. ఎక్కువ శ్రమ పడితే శ్రమకు తగ్గ శక్తి ఇచ్చేందుకు గ్లూకోజ్ (చెక్కర) స్థాయి తొందరగా ఖర్చయిపోతుంది. దీంతో శరీరం నీరసించిపోవడమే గాకుండా చెమటలు పడుతాయి. దీంతో అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉంటుంది. బీపీ ఉన్నవాళ్లు ఉప్పు తగ్గించుకుంటే ఇంకా మంచిది.

రంజాన్ ఉపవాస రోజుల్లో తీసుకోవాల్సిన ఆహారం

తెల్లవారుజామున (సహెర్): ఉదయం నిద్ర లేవగానే ఒక గ్లాసు గోరు వెచ్చని నీటిలో కొద్దిగా నిమ్మకాయ రసం పిండుకొని తాగాలి. తర్వాత ఒక కప్ 150 ఎంఎల్ కాఫీ, లేదా టీ వెన్న తీసిన పాలతో పంచదార లేకుండా తీసుకోవాలి.

భోజనం: 100 గ్రాముల జల్లెడ పట్టని గోధుమ పిండితో పుల్కాలు, లేదా 100 గ్రాముల ముడి బియ్యంతో అన్నం, మాంసం, చేప, ఇగురుకూర, ఆకుకూర పప్పు, సాంబరు, వెన్నతీసిన మజ్జిగ, పెరుగు, బత్తాయి, కమల, జామ, 20 ద్రాక్షపండ్లు, యాపిల్, బొప్పాయి ముక్కలు తీసుకోవాల్సి ఉంటుంది

ఉపవాసం విరమించేటప్పుడు (ఇఫ్తార్): ఉపవాసం విరమించేటప్పుడు కాఫీ టీకి బదులుగా పాలు, లేదా వెన్న తీసిన మజ్జిగ తీసుకోవాలి. తక్షణ శక్తి కోసం 5–10 ఎండు ఖర్జూరాలు, లేదా 10–15 కిస్‌మిస్ తీసుకోవాలి. వాటితో పాటు జామ, బొప్పాయి, కమలా, పుచ్చకాయ, బత్తాయి పండు ముక్కలు తీసుకోవచ్చు.

రాత్రి పూట: కూరగాయల పప్పు, సాంబారు, వెన్నతీసిన మజ్జిగ లేదా పెరుగు తీసుకోవచ్చు. లేదా ముడి బియ్యంతో అన్నం లేదా గోధుమ పిండితో చేసిన పుల్కాలు అందులోకి మాంసం, చేపలు, చర్మం లేని కోడి మాంసంతో కూర వంటివి తీసుకోవచ్చు.

సెపక్‌తక్రా విజేతలకు బహుమతుల ప్రదానం



విజేత జట్లకు బహుమతులను ప్రదానం చేసిన నిర్వాహకులు

ఆదోనిసెంట్రల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరుగుతున్న ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల సెపక్‌తక్రా పోటీలు నాలుగో రోజు బుధవారం కొనసాగాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా రాయలసీమ విశ్వవిద్యాలయం డైరెక్టర్, ప్రొఫెసర్ ఎస్‌టీకే నాయక్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ అంకన్న పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. అంతిమ పోటీల్లో క్వాడ్రెంట్ ఈవెంట్‌లో మొదటి స్థానం పంజాబ్ యూనివర్సిటీ పాటియాలా, రెండో స్థానం యూనివర్సిటీ ఆఫ్ కాలికట్, మూడో స్థానం అన్నా యూనివర్సిటీ – చెన్నై, మణిపూర్ విశ్వవిద్యాలయాలు విజయం సాధించాయి. కర్నూలు సెయింట్ జోసెఫ్ కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ శౌరిల్ రెడ్డి, డాక్టర్ జ్యోతిర్మయి, కళాశాల కరస్పాండెంట్ మురళీబాబు ప్రత్యేక అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయన్నారు. కళాశాల చైర్మన్ విట్టా సతీష్, వైస్ చైర్మన్ డాక్టర్ విజయలక్ష్మి, కరెస్పాండెంట్ దైవీదీనంరెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్, విశ్వనాథరెడ్డి, మేనేజ్‌మెంట్ సభ్యులు సనత్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, సుగూరప్ప, బసవన్నగౌడ్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, ఎర్రిస్వామి, కంబిరెడ్డి, రాయలసీమ విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరెక్టర్లు శివకిషోర్, మత్తయ్య, కళ్యాణ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



కౌతాళంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలనే మళ్లీ గెలిపిస్తాయని ఆ పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ముందుగా ఖాదర్‌లింగస్వామి దర్గా, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం కౌతాళంలో ప్రచారం చేపట్టారు. 14వ వార్డులోని కురవ వీధిలో ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని కోరారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించి, అవి కొనసాగడంతో పాటు మరింత సంక్షేమం పొందడానికి మళ్లీ జగనన్నను గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలను నమ్మొద్దని, అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయులు సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, వడ్డెరాము, భీమేష్ అబ్దుల్ సమద్, రాజ్‌అహ్మద్, అవతారం, గిరి, ఇద్రూస్, ఈడిగశివ, వార్డు మెంబర్లు మోదీన్, హుసేని, వీరేష్, పంజారిబాషా, ఉలిగప్ప పాల్గొన్నారు. అనంతరం గృహసారథులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల్లో చేపట్టాల్సిన విషయాలపై చర్చించారు.

కడుపుబ్బా నవ్వించిన కామన్న వేడుకలు



విచిత్ర వేషధారణలో యువకులు

హొళగుంద: మండల కేంద్రంలో విరక్త మఠం పరిసర ప్రాంతాలకు చెందిన యువకుల ఆధ్వర్యంలో జరుగుతున్న కామన్న వేడుకల్లో భాగంగా బుధవారం యువకులు వేసిన వేషాలు ప్రజలను అమితంగా ఆకట్టుకున్నాయి. అనేక రకాల హాస్య సన్నివేశాలను ప్రదర్శిస్తూ కుట్టిదరే కుట్టమ్మ, ఇల్లిబా సంగయ్య, కూతురి కాన్పుకష్టాలు, సన్యాసులు, వరుడి అన్వేషణ, శోభనం, కామన్న భార్యల కష్టాలు, కామన్న దహనం ఇలా పలు హాస్య సన్నివేశాలను ప్రదర్శిస్తున్నారు. ఆఖరి రోజు రాక్షసుల దహనం ఇతర నాటకాలు, సన్నివేశాలతో ముగింపు ఉంటుందని విరక్త మఠం యువకులు తెలిపారు.

ఘనంగా ఉరుసు

ఆదోనిరూరల్: మండలంలోని ఆరేకల్ గ్రామంలో బుధవారం జెల్లి నాగన్నతాత ఉరుసును గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు దర్గాకు తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. తాత సమాధికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తాగునీరు, వసతి, అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల రాకతో దర్గా ప్రాంగణం కిటకిటలాడింది.

పరీక్షా కేంద్రాల్లో డీఈఓ తనిఖీ



హొళగుంద పరీక్షా కేంద్రం వద్ద డీఈఓ శామ్యూల్

హొళగుంద: మండలంలో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం డీఈఓ శామ్యూల్ ఆకస్మిక తనిఖీ చేశారు. గదులన్నీ కలియతిరిగి విద్యార్థులు కాపీ చీటీలు, మాస్ కాపీయింగ్ పాల్పడుతున్నారా అని పరిశీలించారు. విద్యార్థులు రాసిన అన్సర్ షీట్‌లను పరిశీలించారు. ఎవరైనా చూచి రాతకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే కేంద్రాలలో తాగునీరు, వైద్యసేవలు, ఇతర సదుపాయాల గురించి పరీక్షా కేంద్రాల చీఫ్‌లు కబీర్‌సాబ్, రమణయ్య, మల్లికార్జునగౌడ్‌లను అడిగి తెలుసుకున్నారు. మొత్తం మూడు కేంద్రాల్లో 536 మందికి గాను 21 మంది పరీక్షకు గైరాజరైనట్లు డీఈఓ శామ్యూల్ తెలిపారు.

కోసిగిలో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పారా మిలటరీ దళాలు

కోసిగి: మండల కేంద్రంలో సెంట్రల్ పారా మిలటరీ దళాలు కవాతు నిర్వహించాయి. బుధవారం సాయంత్రం సెంట్రల్ పారా మిలటరీ అడిషనల్ ఎస్పీ రాకేష్ ఆధ్వర్యంలో కోసిగి సీఐ ప్రసాద్, ఎస్‌ఐ సతీష్‌కుమార్‌తో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన రోడ్డు వెంట వైఎస్సార్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, మార్కండేయ స్వామి దేవాలయం, నాడుగేని వీధిలో కవాతు చేపట్టారు. సీఐ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా సారించినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. దొడ్డి, బెళగల్ గ్రామాల్లో కవాతు చేపట్టినట్లు చెప్పారు.

వైభవం..శ్రీ బసవేశ్వర స్వామి ప్రభోత్సవం



భక్తుల మధ్య సాగుతున్న స్వామి వారి ప్రభోత్సవం

కోసిగి: మండలంలోని జంపాపురం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ బసవేశ్వర స్వామి ప్రభోత్సవం బుధవారం సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య వైభవంగా సాగింది. వేకువజాము నుంచి ఆలయ అర్చకులు నిత్యానంద స్వామి, రాజశేఖర స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, మహా మంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. సాయంత్రం సంప్రదాయబద్ధంగా స్వామి వారి ఉత్సవమూర్తిని పల్లకీలో కొలువుంచి కళశాలు, మేళతాళాలు, డప్పువాయిద్యాయుల నడుమ ఊరేగింపుగా ఆలయం చెంతకు చేర్చారు. అనంతరం ప్రభోత్సవం అధిష్ఠింపజేసి స్వామి వారి పాదాల చెంత వరకు ఊరేగించి తిరిగి యథాస్థానం చేర్చారు. భక్తులు ప్రభపై అరటి పళ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎస్‌ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



బసవేశ్వర వేషధారణలో విన్యాసాలు చేస్తున్న కళాకారులు

ఉక్కు ఫ్యాక్టరీలో కార్మికుడి మృతి

మంత్రాలయం : మండలంలోని మాధవరం ఉక్కు ఫ్యాక్టరీలో బుధవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఛతీస్‌ఘడ్‌కు చెందిన బోటిగంగ (38) అనే కార్మికుడు ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా తలపై ఇనుప రాడ్డు పడటంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. విషయం తెలుసుకున్న మాధవరం ఎస్‌ఐ కృష్ణమూర్తి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోతుల బెడదతో బెంబేలు

దేవనకొండ: మండలకేంద్రంలో కోతుల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. స్థానిక మంగలి వీధికి చెందిన రంగమ్మ అనే వృద్ధురాలిపై బుధవారం కోతులు దాడులు చేసి తలపై కొరికాయి. దీంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. స్థానికులు వెంటనే దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అక్కడినుంచి కర్నూలుకు రెఫర్ చేయగా జిల్లా కేంద్రంలో వైద్య చికిత్సలు చేయించుకుని రాత్రి ఇంటికి చేరుకున్నారు. కోతుల బెడదపై ఎన్నిసార్లు పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.